క్లుప్తంగా

పంట పొలాలను పరిశీలించిన పొంగులేటి



పొలాలను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

కల్లూరురూరల్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రిగా ఎంతో బీజీగా ఉండే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రంలో వరి పొలాలను పరిశీలించారు. పాల్వంచలో అభి వృద్ధి కార్యక్రమాలపై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష ముగించుకొని.. నేరుగా కల్లూరులోని నారాయణపురం చేరుకున్నారు. అక్కడ సాగు చేస్తున్న తన వరి పొలాలను పరిశీలించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న చంద్రుపట్లకు చెందిన కాంగ్రెస్ నాయకుడు వేలాద్రిని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నానో ఎరువులు వాడుకోవచ్చు..



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఏన్కూరు: రైతులు నానో ఎరువులు వాడుకోవచ్చని వ్యవసాయాధికారి నర్సింహారావు తెలిపారు. ఆదివారం మండలంలోని తూతక లింగన్నపేట, ఏన్కూరులోని ఎరువుల దుకాణాల్లో పోలీసులు, వ్యవసాయాధికారులు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం ఎరువులు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు నానో ఎరువులు కూడా వాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ భాగ్యలహరి, స్పెషల్ బ్రాంచ్ పీసీ రమేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఎర్రుపాలెం: మండలంలోని రామన్నపాలెం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 1991–92 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు.. పాఠశాలలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారికి విద్యనేర్పిన గురువులు ముక్కర వెంకటాప్పారెడ్డి, శ్రీనివాసరావు, కంభంపాటి జయమ్మలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు సూరానేని హనుమంతరావు, గీత, సిద్దారావు, శ్రీనివాసరావు, రత్నం పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి

తల్లాడ: ఈ నెల 31న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని మల్సూర్‌తండాలో భూక్యా రవినాయక్ అధ్యక్షతన నిర్వహించిన లంబాడీ హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాలను అభివృద్ధి చేయాలని, లంబాడీ బాషను అధికారికంగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం 8వ షెడ్యూల్ చేర్చాలని కోరారు. కార్యక్రమంలో నందు, కృష్ణనాయక్, సైదానాయక్, లింగానాయక్, నాగరాజు, పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

చింతకాని: మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో కారు పూర్తిగా దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన దొబ్బల రంగారావు తన కారులో బోనకల్ నుంచి ఖమ్మం వెళ్తుండగా పందిళ్లపల్లి గ్రామ సమీపంలోకి చేరుకోగానే కారు ఇంజన్‌లో నుంచి పొగలు వస్తుండటంతో వెంటనే ఆపి కిందకు దిగాడు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు చేరుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపాడు.

నేడు అమరవీరుల సంస్మరణ సభ

ముదిగొండ: ముదిగొండలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేటికి 18ఏళ్లు పూర్తి అవుతున్నట్లు తెలిపారు. పోలీసుల కాల్పుల్లో ఏడుగురిని మరణించగా, 18మంది గాయాలైన విషయం తెలిసిందే. అమరుల స్థూపం వద్ద కుటుంబ సభ్యులతో పాటు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం మధిర డివిజన్ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిధిగా తమ్మినేని వీరభద్రం హాజరువుతారన్నారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకే మొగ్గు

- పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ
- సబ్సిడీపై డ్రిప్, మొక్కలు ఇస్తున్న ప్రభుత్వం
- మూడేళ్లలో దిగుబడి.. ఎకరాకు రూ.లక్ష రాబడి
- ఆసక్తి కనబరుస్తున్న రైతులు



బోనకల్‌లో సాగుచేసిన ఆయిల్‌పామ్ తోట



బోనకల్: అత్యధికంగా వంట నూనె దిగుబడిని ఇచ్చే పంటల్లో ప్రధానమైనది 'ఆయిల్ పామ్ 'సాగు. ఏటా సంప్రదాయ పంటల సాగుతో నష్టాలను చవిచూస్తున్న రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టేందుకే మొగ్గు చూపుతున్నారు. ఈ పంటకు సాగునీరు అంతగా అవసరం లేదు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో మూడు ఎకరాల ఆయిల్‌పామ్ సాగు చేపట్టవచ్చు. ఈ సాగుకు లోతైన ఒండ్రు నేలలు అనుకూలం కావడంతో రైతులు ఎక్కువగా టెనెరా హైబ్రిడ్ రకాన్ని సాగు చేస్తున్నారు. దీంతో పలుచని పెంకు అధికంగా పీచు బాగం, ఎక్కువ నూనె శాతాన్ని కలిగి ఉంటుంది.

సాగు ఎలా చేయాలంటే..

మొక్కలు నాటే సమయంలో సమాంతర త్రిభుజాకార పద్ధతి, లేదా చతురస్ర ఆకార పద్ధతిలో 60x60x60 సెంటీమీటర్ల పరిమాణంతో గుంటలు తీయాలి. మొక్క నాటుటకు ముందు ప్రతీ గుంటకు అడుగు భాగంలో 400 గ్రాములు ఎస్ఎస్‌పీ లేదా 250 గ్రాముల డీఏపీ, 50 గ్రాముల ఫోరెట్ 10జీ గులికలు, బాగా కుళ్లిన పశువుల ఎరువును మట్టిలో కలిపి వేయాలి. 12నెలల వయస్సు గల మొక్కలను నాటుటకు ఎంపిక చేసుకోవాలి. ఎకరానికి సమాంతర త్రిభుజాకార పద్ధతిలో 57మొక్కలు, చతురస్రాకార పద్ధతిలో 50 మొక్కలు నాటుకోవాలి.

అంతర పంటలతో ఆదాయం..

ఆయిల్‌పామ్ సాగులో మొదటి మూడు సంవత్సరాల కాలంలో అంతర పంటలైన మినుము, పెసర, పూలు, కూరగాయలు, మిరప వంటి అంతర పంటలను పండించి ఆదాయాన్ని పొందవచ్చు. ఎకరానికి రూ.రెండు లక్షలు వరకు ఆదాయం మిగులుతుంది. ఈ గెలలను ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ కొనుగోలు చేస్తుంది. ఖచ్చితమైన మార్కెటింగ్ వ్యవస్థ.. వారానికి ఒకసారి ఆయిల్‌పామ్ రైతులకు వారి బ్యాంక్ ఖాతాలో అమ్మిన గెలల నగదు చెల్లింపులు జరుగుతాయి. దీంతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది..



ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ప్రభుత్వం రాయితీ సౌకర్యాలను కల్పించడంతో పాటు ఎక్కువమంది రైతులను ప్రోత్సహిస్తుంది. ఈ తోటలకు 90శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందించడం జరుగుతుంది. – పసునూరి వినయ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి

అవగాహన కల్పిస్తున్నాం..



ఆయిల్‌పామ్ సాగు పెంచేందుకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మండలంలోని ప్రతి గ్రామంలో ఎక్కువ భూమి కలిగిన రైతులు కొంతభాగం ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించాం. – నాగినేని నాగసాయి, మండల విస్తరణాధికారి

కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి..



బోనకల్‌లో ఆయిల్‌పామ్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. వైరాలోని కేంద్రానికి గెలలను రవాణా చేయాలంటే ఖర్చు అధికమవుతుంది. నేను పది ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టాను. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రిప్, మొక్కలను ఇచ్చారు. – చింతయ్య, రైతు, ముష్టికుంట్ల

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



శంకుస్థాపన చేస్తున్న మల్లు నందిని, రాయల నాగేశ్వరరావు

ముదిగొండ: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలను ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి సతీమణి మల్లు నందిని, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులు పేర్కొన్నారు. ఆదివారం ముదిగొండ మండలంలోని ముదిగొండ, వెంకటాపురం, కట్టకూరు గ్రామాల్లో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అనంతరం కట్టకూరులో పలుపార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలైన లబ్ధిదారులకు మాజీ సర్పంచ్ రమేష్ సహకారం..

మండలంలోని మేడేపల్లి గ్రామంలోని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేదలైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గ్రామ మాజీ సర్పంచ్ సామినేని రమేష్ రూ.2లక్షలు వడ్డీలేకుండా సాయమందిస్తున్నారు. గ్రామంలో 24మంది లబ్ధిదారులు ఉండగా వారందరికీ రూ.2లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు రమేష్ పేర్కొన్నారు. దీంతో ఆయనను గ్రామస్తులు అభినందించగా.. లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

నాగులవంచలో..

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోయించి నిర్మాణాలను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలన్నారు. గ్రామంలో 20 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బస్వయ్య, వీరభద్రం, వెంకటేశ్వర్లు, చిన్నఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన ఎమ్మెల్యే రాగమయి, నాయకులు

తల్లాడ: జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తల్లాడ సొసైటీ మాజీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ జక్కంపూడి కృష్ణమూర్తి సేవలు మరువలేనివని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని బిల్లుపాడు గ్రామంలో ఆదివారం జక్కంపూడి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయితో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధిగా జక్కంపూడి ఈ ప్రాంతానికి ఎంతో అభివృద్ధి చేయించారని, బిల్లుపాడు పరిసర గ్రామాలను మరింత అభివృద్ధి చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జక్కంపూడి కాంగ్రెస్ గెలుపు కోసం విస్తృత ప్రచారం చేశారన్నారు. ఆయన మృతి పార్టీకీ తీరని లోటన్నారు. ఈ సందర్భంగా మాతృమూర్తి, పితృదేహో భవ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రఘుపతిరెడ్డి, కిషోర్, చంద్రశేఖర్, రామప్పారావు, రమణమ్మ, కృష్ణయ్య, అనీల్, రమేష్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో లబ్ధిదారుడికి ఆదివారం కాంగ్రెస్ నాయకులు సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న బత్తుల రాధాకృష్ణకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.60 వేల చెక్కును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గోపాలరావు, కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, తిరుపతిరావు, చిన్నప్ప, సీపీఐ నాయకులు కృష్ణ, వెంకట్రావు, వెంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రాధాకృష్ణకు చెక్కు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్ర విరిగితే.. ప్రమాదమే

కారేపల్లి: ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు అమర్చాల్సిన ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. మండలంలోని గేటురేలకాయలపల్లి ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రోడ్డుకు అవతల విద్యుత్ స్తంభాలతో విద్యుత్ తీగలను అమర్చాల్సి ఉండగా.. కర్ర ఏర్పాటు చేసి విద్యుత్ తీగలు అమర్చారు. అసలే వర్షాకాలం, దీనికి తోడు ఈదురుగాలులు.. పొరపాటునా కర్ర విరిగి విద్యుత్ తీగలు రోడ్డుపై పడి జరగరానిది జరిగితే.. ఎవరు బాధ్యులు అని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కర్ర స్థానంలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కర్ర సాయంతో విద్యుత్ తీగలు అమర్చిన దృశ్యం

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

బోనకల్: అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని డిప్యూటీ సీఎం భట్టి సతీమణి మల్లు నందిని అన్నారు. మండలంలోని రాయన్నపేట గ్రామంలో ఆదివారం రాత్రి కలకోట, రాయన్నపేట, ఆళ్లపాడు, గోవిందాపురం(ఏ) గ్రామాల్లో పలు పార్టీలకు చెందిన 150 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరగా.. వారందరికీ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముందుగా గ్రామంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మాకమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్, జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు, నాయకులు దుర్గారావు, రమ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనం మంజూరు చేయాలి



పల్లె దవాఖానాను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల పల్లెదవాఖానా శిథిలమైనందున నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ బృందం దవాఖానాను సందర్శించి మాట్లాడారు. పల్లె దవాఖానా లోతట్టు ప్రాంతంలో ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరుకుందని, వర్షం వస్తే నీరు బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో నీరు నిల్వ ఉండి పారిశుద్ధ్యం లోపించిందన్నారు. దీంతో దవాఖానాకు వచ్చే ప్రజలు అనారోగ్యం బారినపడే అవకాశం ఉందన్నారు. అనంతరం కార్యదర్శి సైదులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవన్, బాస్కర్ రావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

వైరా: ఈ నెల 29న కొణిజర్ల శ్రీరామ కల్యాణ మండపంలో నిర్వహించే సీపీఎం వైరా డివిజన్ వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని ఆ పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వర్క్‌షాప్‌కు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శనరావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు పాల్గొని మాట్లాడుతారని తెలిపారు. వైరా డివిజన్‌లో సీపీఎం నాయకులు వర్క్‌షాప్‌లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

శంకుస్థాపన

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్‌వాడీ భవనానికి ఆదివారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పేదలకు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఏన్కూరు: పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, సిబ్బంది

ఏన్కూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ సీఈఓ నాగపద్మజ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆమె ఇంటింటికీ తిరుగుతు పరిసరాలను, జ్వర భాదితులు ఉన్నారా అని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఆశాకార్యకర్త గృహసందర్శనం చేయాలని, ప్రతి రోజు 90 ఇళ్లను సందర్శించాలని, జ్వరం సోకిన వారికి డెంగీ, మలేరియా టెస్ట్‌లు చేయాలన్నారు. డెంగీ, మలేరియా సోకిన వారిని ఆస్పత్రికి తరలించారు. గురుకులంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మౌనిక, ఎస్ఎం అరుణ, పంచాయతీ కార్యదర్శులు రాంకీ, గోపి, ఆశాలు పాల్గొన్నారు.

కొణిజర్ల ఎస్సీ కాలనీలో..

కొణిజర్ల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ఇంటింటికీ తిరుగుతూ.. స్థానికులకు పారిశుద్ధ్యంపై డీఎల్‌పీఓ రాంబాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైడ్ కాలువలను శుభ్రం చేయించాలని జీపీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ సందర్భంగా చెత్త సేకరణకు ట్రాక్టర్ రావడం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా.. చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేంద్రయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీతో పాటు అన్ని గ్రామాల్లో గంగారం పీహెచ్‌సీ సిబ్బంది ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.అవినాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిల్లో జర్వపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి మందులు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శారారాణి, విజయకుమారి, రామారావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అక్రమంగా మామిడి తోట నరికివేత

- ఫైనాన్స్ వ్యాపారి పై చర్యలు తీసుకోండి
- బాధితుల వేడుకోలు



చంద్రుపట్లలో నరికి వేసిన మామిడి చెట్లు

కల్లూరు: మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో ఓ ఫైనాన్స్ వ్యాపారి అక్రమంగా మామిడి చెట్లు నరకడంపై వివాదం రాజుకుంది. బాధితుడు మానాల రవికుమార్, యశోధ కళ్యాణి దంపతులు తెలిపిన వివరాల ప్రకారం.. తోకచిచ్చు ఆంజనేయరాజు వద్ద 2014లో చంద్రుపట్ల గ్రామంలో 13 కుంటలు, ఎన్ఎస్‌పీలో 1.10 ఎకరం భూమిని సేల్ రిజిస్ట్రేషన్ చేసి రూ.7 లక్షలు తీసుకోవడం జరిగిందని, తనకు డబ్బులు వచ్చిన తర్వాత తన పొలం తనకు ఇవ్వాలనే ఒప్పందంతో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. 2022లో తమకు డబ్బులు రాగానే ఫైనాన్స్ వ్యాపారి వద్దకు వెళ్ళి డబ్బులు వడ్డీతో సహా చెల్లిస్తానని తన పొలం తనకు రిజిస్ట్రేషన్ చేయాలని తాము పలుమార్లు కోరగా, తీసుకున్న నగదుకు వడ్డీతో కలిపి సరిపోయిందని, పొలం తన పేరుమీద ఉందని చెబుతూ డబ్బులు తీసుకోకుండా వాయిదాలు వేస్తూ వచ్చాడన్నారు. శనివారం చంద్రుపట్ల రోడ్‌లో ఉన్న తనకున్న 13 కుంటల్లో ఉన్న మామిడి చెట్లను ఆంజనేయరాజు తన అనుచరులతో వచ్చి నరికివేసాడన్నారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని, తమ పొలం తమకు ఇప్పించి ఫైనాన్సర్ ఆంజనేయరాజుపై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

దోస్త్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రారంభం



ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి

మధిర: డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం దోస్త్ ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో చేరడానికి ఇదే చివరి అవకాశమని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దోస్త్ ప్రత్యేక విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ జూలై 25 నుంచి 31 వరకు ఉంటుందని తెలిపారు. ఆగస్ట్ 3వ తేది దోస్త్ ప్రత్యేక విడత సీట్ల కేటాయింపు ఉంటుందని, 3 నుంచి 6వరకు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, 4 నుంచి 6వ తేదీ వరకు కాలేజీల్లో కన్ఫర్మేషన్ రిపోర్టు చేయాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 94402-57256, 94417-86508 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ



పండ్లు, రొట్టెలు అందిస్తున్న మంజుల, నాయకులు

కారేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల అన్నారు. ఆదివారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా.. కారేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పదేళ్లుగా సొంతింటి కల కోసం ఎదురు చూస్తున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం వారి కండ్లల్లో ఆనందం చూస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఐలయ్య, ఉమాశంకర్, శ్రీనివాసరావు, రాములు, హనీఫ్, హేమలత, వెంకటేశ్వర్లు, వీరభద్రం, జగ్గయ్య, రవి, మజీద్ పాషా, చాయాదేవి, భూక్యా బాలు, రోషయ్య, కోటి, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

మధిర: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల సేవాసదనంలో ఎన్‌టీఆర్ జిల్లా వీరులపాడు మండలం అల్లూరు గ్రామానికి చెందిన మేకా అరుణ 6వ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుమార్తెలు హిషిత, నిఖిత మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవాసదనం నిర్వాహకులు నల్లపు స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ పోరాట ఫలితమే వేతనాలు విడుదల

కల్లూరు: ఆస్పత్రి కార్మికులు వేతనాలు విడుదల.. ఏఐటీయూసీ పోరాట ఫలితమేనని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు పేర్కొన్నారు. కల్లూరులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని కల్లూరు, సత్తుపల్లి, పెనుబల్లి ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు విడుదల అయ్యాయన్నారు. దీంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేసి.. ఏఐటీయూసీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యేబు, దయాకర్, కార్మికులు వంశీ, ప్రమోద్, సత్యవతి, నాగమణి, రమాదేవి, సరోజిని, లక్ష్మీప్రసన్న, కృష్ణ పాల్గొన్నారు.

తల్లాడలో పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది, పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తల్లాడ: తల్లాడలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆదివారం 'సాక్షి'లో 'డెంగీతో వణుకుతున్న తల్లాడ' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. తల్లాడలో ఏ వీదిలో చూసినా అపరిశుభ్ర వాతావరణమే అని అందులో ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి.. తల్లాడ ఎంపీడీఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీలో.. జీపీ సిబ్బంది, వైద్య సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆగిన నీటిని తొలగిస్తూ, నీరు చేరుకున్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి, దోమలు ప్రబలకుండా దానిపై పైరిత్రం అనే మందును చల్లారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి కృష్ణారావు ఆశ వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.